
ఈనాడు
ఒడిశా
గురువారం అక్టోబరు 24, 2024

నేడు లేదా రేపు తీరం దాటొచ్చు



గోపాలపూర్, న్యూస్‌టుడే: దానా తుపాను గురువారం అర్ధరాత్రి లేదా శుక్రవారం ఉదయం ఒడిశాలోని ధమ్రా, బితర్‌కనికాల మధ్య తీరం దాటనుందని గోపాల్‌పూర్ వాతావరణ అధ్యయన కేంద్రం (ఐఎండీ) అధికారి ఉమాశంకర్ దాస్ బుధవారం సాయంత్రం 'న్యూస్‌టుడే'కు చెప్పారు. కేంద్ర బంగాళాఖాతంలో కేంద్రీకృతమై ఉన్న తుపాను ఉత్తర, పశ్చిమ దిశగా తీరానికి చేరువవుతున్నట్లు తెలిపారు. పరదీప్‌కు దక్షిణ తూర్పు దిశలో 460 కిలోమీటర్లు, ధమ్రాకు 490 కి.మీ., సాగర ద్వీపానికి (పశ్చిమబెంగాల్) 540 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ విపత్తు గంటకు 12 కిలోమీటర్ల వేగంతో తీరం వైపునకు వస్తున్నట్లు చెప్పారు. ఈ తీవ్ర తుపానుపై పరదీప్, ధమ్రా, పూరీ ఓడరేవులకు 10వ నెంబరు, గోపాల్‌పూర్‌కి 8వ నెంబరు ప్రమాద హెచ్చరికలు జారీ చేశామన్నారు. భారీ వర్షాలు కురుస్తాయన్నారు.

20 సెంటీమీటర్లకు మించి వర్షాలు: తుపాను తీరం దాటే సమయంలో గాలి తీవ్రత 100 నుంచి 120 కిలోమీటర్లుగా ఉంటుందన్నారు. జగత్సింగ్‌పూర్, కేంద్రపడ, కటక్, భద్రక్, జాజ్‌పూర్, బాలేశ్వర్, మయూర్‌భంజ్ జిల్లాల్లో గురు, శుక్రవారాల్లో 20 సెంటీమీటర్లకు మించి వర్షాలు కురుస్తాయన్న అంచనాతో రెడ్ అలర్ట్ ప్రకటించామన్నారు. పూరీ, ఖుర్దా, కేంఝర్, నయాగఢ్, ఢెంకనాల్ జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయన్న అంచనాతో ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేశామన్నారు. గంజాం, బౌద్ధ్, అనుగుల్, దేవ్‌గఢ్, సుందర్‌గఢ్, కొంధమాల్ జిల్లాల్లో ఒక మోస్తరు వర్షాలు (7 నుంచి 11 సెంటీమీటర్లు) అంచనాతో 'ఎల్లో' హెచ్చరికలు జారీ చేశామన్నారు.

బయట తిరగొద్దు: తీర ప్రాంతాలు బుధవారం సాయంత్రం మేఘావృతమయ్యాయి. పరదీప్, భద్రక్, ధమ్రా, బాలేశ్వర్ ప్రాంతాల్లో జల్లులు కురిశాయి. క్రమేణా గాలుల తీవ్రత, వర్షాలు పెరుగుతాయని దాస్ చెప్పారు. గురువారం సాయంత్రం నుంచి శుక్రవారం ఉదయం 10 గంటల వరకు ప్రభావితం కానున్న జిల్లాల్లో ప్రజలు బయటకు రావద్దని, ఇళ్లు, ఆశ్రయ కేంద్రాల్లో సురక్షితంగా ఉండాలన్నారు. పెనుగాలుల వల్ల విద్యుత్ స్తంభాలు, చెట్లు కూలొచ్చన్నారు. పంటలూ ప్రభావితమవుతాయని, పొలాల్లో నీరు నిల్వ ఉండకుండా రైతులు గట్లు కొట్టి నీరు బయటకు వెళ్లేలా చూడాలన్నారు. యువతీ యువకులు ద్విచక్ర వాహనాల్లో తిరగొద్దని, తీర ప్రాంతాలకు దూరంగా ఉండాలని దాస్ సూచించారు.



రాష్ట్రం అప్రమత్తం

రాష్ట్రాన్ని దానా తుపాను భయపెడుతోంది. గురువారం రాత్రి లేదా శుక్రవారం ఉదయం ఇది తీరం దాటుతుందన్న అంచనాల మధ్య ప్రభుత్వం అప్రమత్తమైంది. ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి ప్రాణనష్టం లేకుండా చర్యలు తీసుకుంటోంది. గర్భిణులను ఆసుపత్రులకు తరలించడంతోపాటు మత్స్యకారులను అధికారులు అప్రమత్తం చేశారు. తుపాను ప్రభావం చూపుతుందని భావిస్తున్న జిల్లాల్లో ఏర్పాట్లు, జాగ్రత్తలు పర్యవేక్షించేందుకు మంత్రులు, ఐఏఎస్ అధికారులను నియమించారు. ఓడ్రాఫ్, అగ్నిమాపక సిబ్బంది, రెవెన్యూ అధికారులను అప్రమత్తం చేశారు. పునరావాస కేంద్రాల్లో అన్నిరకాల సౌకర్యాలు కల్పించారు. పూరీ జగన్నాథుడి దర్శనాలను రెండురోజులు రద్దు చేశారు. సముద్ర పరిసరాల్లోకి ఎవరూ వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

పర్యవేక్షణకు మంత్రులు, ఐఏఎస్‌లు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: తుపాను ప్రభావిత ప్రాంతాల్లో శాసనసభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు సహాయ కార్యక్రమాల్లో పాల్గొనాలని ముఖ్యమంత్రి మోహన్‌చరణ్‌మాఝి సూచించారు. బుధవారం ఉదయం లోక్‌సేవాభవన్‌లో ఆయన ఉన్నతాధికారులతో సమీక్షించారు. 9 మంది మంత్రులు, ఆరుగురు ఐఏఎస్ అధికారులకు ఆయా జిల్లాలకు పర్యవేక్షకులుగా నియమించారు.

ఎవరు?.. ఎక్కడ?

మంత్రి	జిల్లా
బిభూతిభూషణ్ జెనా	గంజాం
సంపద్‌స్వయిన్	జగత్సింగ్‌పూర్
రబినారాయణనాయక్	బాలేశ్వర్
సూర్యవంశీ సూరజ్	భద్రక్
కృష్ణచంద్ర మహాపాత్ర్	మయూర్‌భంజ్
ప్రభాతిపరిడ (ఉపముఖ్యమంత్రి)	పూరీ
కనకవర్ధన్ సింగ్‌దేవ్ (ఉపముఖ్యమంత్రి)	కేంద్రపడ
కృష్ణచంద్రపాత్ర్	కేంఝర్
పృథ్వీరాజ్ హరిచందన్	కటక్

ఐఏఎస్ అధికారులు వీరే...


6 జిల్లాలకు ఐఏఎస్ అధికారులు పరిశీలకులుగా నియమితులయ్యారు. బాలేశ్వర్‌కు కె.సుదర్శన్ చక్రవర్తి, భద్రక్‌కు త్రిలోచన్ మాఝి, పూరీకి బల్వంత్‌సింగ్, మయూర్‌భంజ్‌కు వినీత్‌భరద్వాజ్, జగత్సింగ్‌పూర్‌కు యామినీ షడంగి, కేంద్రపడకు సమర్ధవర్మ నియమితులయ్యారు.

పునరావాస కేంద్రాలకు వెళ్లండి: మంత్రి సురేష్

తీర, లోతట్టు ప్రాంతాల ప్రజలు వెంటనే పునరావాస కేంద్రాలకు వెళ్లాలని, నిర్లక్ష్యం చేయకుండా యంత్రాంగం ఆదేశాలు పాటించాలని రెవెన్యూ, విపత్తుల నివారణ శాఖల మంత్రి సురేష్ పూజారి ప్రభావితం కానున్న ప్రాంతాల ప్రజల్ని కోరారు. బుధవారం సాయంత్రం ఆయన భువనేశ్వర్‌లో విలేకర్లతో మాట్లాడుతూ కొందరు రావడానికి సుముఖంగా లేరని, సంకోచం వద్దని, వారు నిర్భయంగా వెళ్లొచ్చని, అక్కడ అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. వారి గ్రామాలు, ఇళ్ల భద్రత పోలీసుశాఖ పర్యవేక్షిస్తుందని, రేయింబవళ్లు పోలీసులు పెట్రోలింగ్ చేస్తారని చెప్పారు.

గాలి వేగాన్ని తగ్గించనున్న చెట్లు

ఐఎండీ అధికారుల అంచనా



గోపాలపూర్, న్యూస్‌టుడే: తీవ్ర వాయుగుండం బుధవారం తుపానుగా మారింది. దీనికి 'దానా'గా నామకరణం చేసిన విషయం తెలిసిందే. గురువారం సాయంత్రానికిది తీవ్ర తుపానుగా మారనుంది. అర్ధరాత్రి లేదా శుక్రవారం ఉదయం ధమ్రా, భితర్‌కనికాల మధ్య తీరం దాటే సూచనలున్నాయని స్థానిక ఐఎండీ కేంద్రం అధికారి ఉమాశంకర్ దాస్ 'న్యూస్‌టుడే'కు చెప్పారు.

ఒడిశా తీరానికి చేరువగా...

కేంద్ర బంగాళాఖాతంలో ఏర్పడిన తుపాను ఐఎండీ తొలి అధ్యయనం ప్రకారం ఉత్తర పశ్చిమ దిశగా ఒడిశా తీరానికి చేరువైంది. ఇది పరదీప్, గోపాల్‌పూర్ రాడార్ కేంద్రాలకు కనిపించింది. దీని బాహ్యవలయం స్పష్టంగా ఉన్నా నేత్రం ఇంకా దృశ్యమానం కాలేదు. ఈ విపత్తు బితర్‌కనికాకు చేరువగా తీరం దాటుతుందని అంచనా వేస్తున్నారు. ఇక్కడ అటవీ ప్రాంతం, విస్తారంగా వృక్షాలున్నాయి. గాలి తీవ్రత నిలవరించడానికి రక్షా కవచంగా నిలుస్తాయి. జనావాసాలకు అంతగా ముప్పు వాటిల్లకపోవచ్చన్న అంచనా ఉంది. ఈ తుపాను తీరం దాటే సమయంలో గాలి తీవ్రత 100 నుంచి 120 కి.మీ. వరకు ఉంటుందని ఐఎండీ స్పష్టం చేసింది. తీర పట్టణాలకు దూరంగా అటవీ ప్రాంతంవైపు తుపాను తీరం దాటనుందని, చెట్లు గాలులకు అడ్డుకట్టవేస్తాయని, పెద్ద నష్టాలు జరగకపోవచ్చని విశ్రాంత ఐఎండీ అధికారి శరత్‌చంద్రసాహు 'న్యూస్‌టుడే'కు చెప్పారు.



తుపాను దిశ(ట్రాక్)

ఈ నాలుగు జిల్లాలపైనే ప్రభావం



తుపాను ప్రభావం కేంద్రపడ, జగత్సింగ్‌పూర్, భద్రక్, బాలేశ్వర్ జిల్లాల్లోనే ఎక్కువగా ఉంటుంది. మిగతా తీర జిల్లాల్లో పాక్షికమని ఐఎండీ అధికారి **ఉమాశంకర్** తెలిపారు. నష్టాలు ఈ నాలుగు జిల్లాల్లోనే అధికంగా ఉంటాయని పేర్కొన్నారు.

10 లక్షల మంది తరలింపు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: తుపాను బారి నుంచి ప్రభావిత ప్రాంతాల ప్రజల రక్షణకు ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టిందని, 10 లక్షల మందిని పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నట్లు రెవెన్యూ, విపత్తుల నివారణ శాఖల మంత్రి సురేష్‌పూజారి చెప్పారు. బుధవారం భువనేశ్వర్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ 5,500 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. వాటిల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు పునరావాస కేంద్రాల్లో సహకరిస్తారని చెప్పారు. ప్రభావితం కానున్న జిల్లాలకు 20 ఎన్డీఆర్ఎఫ్, 19 ఓడ్రాఫ్, 178 అగ్నిమాపక బృందాలు అత్యాధునిక యంత్రసామగ్రితో చేరుకున్నాయన్నారు. పాలనాధికారులు, తహసీల్దార్లు, బీడీఓలు ఏర్పాట్లు పర్యవేక్షిస్తారన్నారు.


భద్రక్ జిల్లా ధాంనగర్ పునరావాస కేంద్రం


ఉన్నతాధికారులతో ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న మంత్రి సురేష్

ప్రత్యేక వైద్య బృందాలు: ఆరోగ్యశాఖ 8 వేల మంది గర్భిణుల జాబితా సిద్ధం చేసింది. వారిని ఆసుపత్రులకు తరలింపు ప్రక్రియ ప్రారంభమైందని ఆ శాఖ సంచాలకుడు డాక్టర్ బిజయ్ మహాపాత్ర్ బుధవారం భువనేశ్వర్‌లో విలేకర్లకు చెప్పారు. వారి ప్రసూతి సేవలకు ఆయాచోట్ల ప్రత్యేక వైద్య బృందాలను సిద్ధం చేశామన్నారు. పునరావాస కేంద్రాల్లోనూ వైద్య సిబ్బందిని నియమించామని, పాముకాటు విరుగుడు, అతిసారం, జ్వరాలను తగ్గించేందుకు అవసరమైన మందులు, ఇంజెక్షన్లు పంపించినట్లు చెప్పారు.

పడవల వినియోగం

గంజాం జిల్లా పాత్రపురం సమితిలోని భగలటి జలాశయం అవతలివైపునున్న ఆదివాసీ గ్రామాల ప్రజల్ని సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. బుధవారం పడవల్లో ఆయా గ్రామాలకు చేరుకుని, ప్రజల్ని ఇవతలి ఒడ్డుకు తరలించే పనులు ప్రారంభించారు.

–న్యూస్‌టుడే, బ్రహ్మపుర నగరం

పడవలో బయలుదేరిన సిబ్బంది


ప్రభావిత ప్రాంతాల్లో పోలీసు బలగాలు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: డీజీపీ యోగేష్ బహదూర్ ఖురానియా బుధవారం కటక్‌లోని పోలీసుశాఖ ప్రధాన కార్యాలయంలో ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లపై సమీక్షించారు. 80 ప్లటూన్ల బలగాలను నియమించాలని నిర్ణయించారు. ఉత్తరకోస్తా, తీర జిల్లాల్లో 'దానా' ప్రభావం ఉంటుందన్న అంచనాతో 14 జిల్లాల్లో యంత్రాంగం గట్టి బందోబస్తు చేసింది. ఖురానియా విలేకర్లతో మాట్లాడుతూ ఎన్డీఆర్ఎఫ్, ఓడ్రాఫ్, అగ్నిమాపక దళాలతో కలిసి పోలీసు బలగాలు సహాయ కార్యక్రమాల్లో పాల్గొంటాయని తెలిపారు. ఆశ్రయ కేంద్రాలు, ఖాళీ అయిన గ్రామాల్లో పెట్రోలింగ్ చేస్తాయన్నారు.

పోలీసు అధికారులతో డీజీపీ ఖురానియా సమీక్ష


సురక్షిత ప్రాంతాలకు గర్భిణులు


పాత్రపురంలోని 'మా గృహ' ఆవరణలో గర్భిణులు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: 'దానా' తుపాను హెచ్చరికల నేపథ్యంలో గంజాం జిల్లాలోని మారుమూల, కొండ ప్రాంతాల్లోని గర్భిణుల్ని సమీపంలోని 'మా గృహ', ప్రాథమిక, సామాజిక ఆరోగ్య కేంద్రాలకు తరలిస్తున్నారు. ప్రసవించడానికి 14 రోజులు గడువున్న 1,678 మందిని ఆరోగ్య శాఖ గుర్తించింది. వీరిలో బుధవారం రాత్రినాటికి 106 మందిని సమీపంలోని ఆరోగ్య కేంద్రాలకు పంపించారు. వీరిలో 61 మంది ప్రసవించారని తల్లులు, బిడ్డలు ఆరోగ్యంగా ఉన్నారని అధికారులు 'న్యూస్‌టుడే'కు చెప్పారు. మిగిలినవారి తరలింపు ప్రక్రియ కొనసాగుతోందని వారు పేర్కొన్నారు.

పునరావాస కేంద్రాల్లో సౌకర్యాలు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: వాతావరణ అధ్యయన కేంద్రం తుపాను ముప్పు హెచ్చరికల నేపథ్యంలో గంజాం జిల్లాలో 25 వేల మందిని తక్షణం సురక్షిత ప్రాంతాలకు తరలించాలని జిల్లా పాలనాధికారి దివ్యజ్యోతి పరిడా అధికారుల్ని ఆదేశించారు. బుధవారం గంజాం జిల్లా కేంద్రం ఛత్రపురంలో దూరదృశ్య శ్రవణ సదస్సు నిర్వహించి మాట్లాడారు. సాగర తీరం, నదులు, చిలికా ఒడ్డున కచ్చ, బలహీనంగా ఉన్న ఇళ్లల్లో ఉంటున్న వారిని తక్షణం తరలించాలని సూచించారు. జిల్లాలో 109 బహుళ వినియోగ తుపాను రక్షిత భవనాలు ఉన్నాయని, అదనంగా మరో 700 పునరావాస కేంద్రాలు గుర్తించామని వివరించారు. ఆయాచోట్ల ప్రజలకు వండిన ఆహారం అందించాలని, తాగునీరు, విద్యుత్తు, ప్రాథమిక చికిత్స వంటి సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. చిన్నారుల కోసం బేబీ ఫుడ్స్‌ను కూడా సిద్ధం చేయాలని పాలనాధికారి పేర్కొన్నారు. తరలింపు సజావుగా జరిగేలా పోలీసు యంత్రాంగం సహకారం తీసుకోవాలని ఆయన సూచించారు. సమావేశంలో అదనపు జిల్లా పాలనాధికారి సుధాంశు కుమార్ భొయి, జిల్లా అత్యవసర విభాగం అధికారి ఆయూష్ పతి, ఇతర అధికారులు పాల్గొన్నారు. గంజాం జిల్లా యంత్రాంగం హెల్ప్‌లైన్ నెంబరు 06811 263978ను జారీ చేసిందని జిల్లా సమాచార, ప్రజా సంబంధాల అధికారి రబినారాయణ బెహరా సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు.


అధికారులతో సమీక్షిస్తున్న దివ్య జ్యోతి పరిడా. చిత్రంలో ఇతర అధికారులు


రాష్ట్రపతి ద్రౌపదీ చేతుల మీదుగా అవార్డు స్వీకరిస్తున్న అనూగార్గ్

నీటి సంరక్షణలో

జాతీయస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన రాష్ట్రం

ఒడిశాకు ఉత్తమ అవార్డు

రాయగడ పట్టణం, భువనేశ్వర్, న్యూస్‌టుడే: నీటి వనరుల సంరక్షణలో రాష్ట్రం అత్యుత్తమ ఫలితాలు రాబట్టింది. ఈ కేటగిరీలో దేశవ్యాప్తంగా ప్రథమ స్థానంలో నిలిచిన రాష్ట్రం ఉత్తమ అవార్డు దక్కించుకుంది. దిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో మంగళవారం జరిగిన జాతీయ 5వ జల్‌శక్తి అవార్డుల కార్యక్రమంలో జల్‌శక్తి మంత్రిత్వశాఖ అవార్డు అందజేసింది. మన రాష్ట్రం తరపున అభివృద్ధి శాఖ కమిషనర్ అనూగార్గ్ రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతుల మీదుగా దీనిని స్వీకరించారు. మంత్రిత్వశాఖ మీడియాకు ఈ విషయాన్ని తెలిపింది. రాష్ట్రంలో దాదాపు 53 వేల నీటి సంరక్షణ, వర్షపునీటి సంరక్షణ కట్టడాలను నిర్మించడంతోపాటు మరో 10,800 పునర్వినియోగ, నీటి రీచార్జ్ నిర్మాణాలను ఒడిశా చేపట్టింది. 68,700 వాటర్‌షెడ్‌లు, 21 వేల వ్యర్థజలాల శుద్ధి కేంద్రాలను నిర్మించింది. మరో 11 వేలకుపైగా సంప్రదాయ నీటి వనరుల పునరుద్ధరణ చర్యలు చేపట్టడం ద్వారా రాష్ట్రం ఈ ఘనత సాధించినట్లు మంత్రిత్వశాఖ స్పష్టం చేసింది. తొమ్మిది కేటగిరిల్లో అవార్డులను ప్రకటించినట్లు పేర్కొన్న ఆ శాఖ వాటిలో ఉత్తమ రాష్ట్రం, పంచాయతీ, గ్రామం, పట్టణ స్థానిక సంస్థ, జిల్లా, పాఠశాల, కళాశాల, పరిశ్రమ, నీటి వినియోగ అసోసియేషన్, పౌరసంస్థ ఉన్నట్లు వెల్లడించింది.

2.21 లక్షల హెక్టార్లకు నీటి పారుదల

వివిధ ప్రాజెక్టుల ద్వారా 2.21 లక్షలకు పైగా హెక్టార్లకు నీటి పారుదల సౌకర్యం కల్పించడం గమనార్హం. దీని ద్వారా 2.5 లక్షల మందికిపైగా అన్నదాతలకు లబ్ధి చేకూరినట్లు మంత్రిత్వ శాఖ అందులో ప్రస్తావించింది. మన రాష్ట్రం తరువాత యూపీ ద్వితీయ స్థానం, గుజరాత్, పుదుచ్చేరి సంయుక్తంగా తృతీయ స్థానాల్లో నిలిచినట్లు ఆ శాఖ పేర్కొంది. నీటి సంరక్షణ చర్యలు సక్రమంగా అమలయ్యేలా రాష్ట్రాలను, ఇతరత్రా కేటగిరి సంస్థలను ప్రోత్సహించేందుకు కేంద్ర జల్‌శక్తి మంత్రిత్వశాఖ జాతీయ జల్‌శక్తి అవార్డులను తొలిసారిగా 2018లో ప్రవేశపెట్టింది. 2019, 2020, 2022లో అవార్డులను ప్రకటించిన మంత్రిత్వ శాఖ 2021లో కొవిడ్ కారణంగా అందజేయ లేదు. తాజాగా 2023 సంవత్సరంలో 5వ జాతీయ అవార్డుల కోసం మొత్తం 686 దరఖాస్తులు అందినట్లు మంత్రిత్వశాఖ స్పష్టం చేసింది. మొత్తం తొమ్మిది కేటగిరిల్లో 38 విజేతలుగా ప్రకటించినట్లు ఆ శాఖ వెల్లడించింది. జిల్లా కేటగిరీలో రాష్ట్రానికి చెందిన బొలంగీర్, పట్టణ స్థానిక సంస్థల కేటగిరిలో పూరీ ప్రథమ స్థానాలను దక్కించుకున్నాయి. మయూర్‌భంజ్ జిల్లా బైసింగలోని ఖాయిర్బాని ఆశ్రమ పాఠశాల తృతీయ స్థానంలో నిలిచి అవార్డు సొంతం చేసుకుంది.


రాష్ట్రానికి దక్కిన అవార్డు

ఓపీఎస్ పరీక్షలు వాయిదా

భువనేశ్వర్, న్యూస్‌టుడే: ఒడిశా పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో ఈ నెల 27న జరగాల్సి ఒడిశా సివిల్ సర్వీస్ (ఓఏఎస్) ప్రిలిమినరీ పరీక్షలు వాయిదా వేసినట్లు ఓపీఎస్‌డీ అధికారవర్గాలు బుధవారం ప్రకటించాయి. తుపానును దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకున్నామని, వారం రోజుల తరువాత పరీక్షల తేదీ ప్రకటిస్తామని పేర్కొన్నాయి.

మహిళలకు 12 సెలవులు అదనం

భువనేశ్వర్, న్యూస్‌టుడే: ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వహిస్తున్న మహిళలకు ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి 12 సెలవులు అదనంగా కేటాయిస్తూ మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రతినెలా రుతుస్రావం సమయంలో ఒక రోజు సెలవు తీసుకోవచ్చు.

ఎస్సీబీలో ఇకపై గుండె మార్పిడి: మంత్రి ముఖేష్ మహాలింగ

భువనేశ్వర్, న్యూస్‌టుడే: కటక్‌లోని ఎస్సీబీ వైద్య కళాశాల ఆసుపత్రిలో ఉచితంగా గుండె మార్పిడి శస్త్ర చికిత్సలు నిర్వహించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం చెన్నైకి చెందిన ఎంజీఎం హెల్త్‌కేర్ సంస్థతో బుధవారం ఈమేరకు ఒప్పందం కుదుర్చుకుంది. ఆరోగ్యశాఖ మంత్రి ముఖేష్ మహాలింగ, ఇతర ఉన్నతాధికారుల సమక్షంలో ఈ ప్రక్రియ పూర్తయింది. అనంతరం మహాలింగ విలేకర్లతో మాట్లాడుతూ అరుదైన గుండె మార్పిడి శస్త్రచికిత్సల సౌకర్యం ఎస్సీబీలో అందుబాటులోకి వస్తుందన్నారు. పేదలకిది వరం అవుతుందని, కొద్ది రోజుల్లో దీనికి అవసరమైన యంత్ర సామగ్రి సమకూర్చుతామని, నిపుణులను నియమిస్తామని చెప్పారు.


మాట్లాడుతున్న ముఖేష్ మహాలింగ

తుపానుపై ముఖ్యమంత్రి సమీక్ష

భువనేశ్వర్, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి మోహన్‌చరణ్‌మాఝి బుధవారం రాత్రి 7 గంటలకు భువనేశ్వర్‌లోని ప్రత్యేక రిలీఫ్ కమిషనర్ (ఎస్ఆర్సీ) కార్యాలయంలో తుపాను పరిస్థితి, అప్రమత్తతపై సమీక్షించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మనోజ్ అహుజా, ఎస్ఆర్సీ దేవ్ రంజన్‌సింగ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అండగా ఉంటాం: నవీన్

తుపాను నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపక్షనేత నవీన్‌పట్నాయక్ బుధవారం రాత్రి వీడియో సందేశం ద్వారా సూచించారు. సహాయ కార్యక్రమాల్లో బిజద క్రియాశీలక పాత్ర పోషిస్తుందన్నారు. ఆ పార్టీ అధికార ప్రతినిధి లెనిన్ మహంతి రెండు ఫోన్ నెంబర్లు విడుదల చేశారు. 9937057528, 8984303534 నెంబర్లకు ఫోన్ చేస్తే అవసరమైన సేవలు అందుతాయన్నారు.

ఇంజెక్షన్ వికటించి బాలింత మృతి

నవరంగపూర్, న్యూస్‌టుడే: ఇంజెక్షన్ వికటించడంతో బాలింత మృతి చెందిన ఘటన నవరంగపూర్ జిల్లాలో జరిగింది. ఐఐసీ దీపక్ కుమార్ జెన్నా తెలిపిన వివరాల ప్రకారం... చెరబట పంచాయతీ భాటికోట గ్రామానికి చెందిన చావ్‌కుమార్ శాంటా భార్య తాంబ శాంటా (20) మూడు నెలల క్రితం నవరంగపూర్ ఆసుపత్రిలో కవల మగపిల్లలకు జన్మనిచ్చింది. 10 రోజుల కిందట ఆమె ఆరోగ్యం క్షీణించడంతో పపదహండి ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యుడు పరీక్షించి మందులు అందజేసి ఇంటికి పంపించాడు. మంగళవారం సాయంత్రం గ్రామంలోని ఆశ, ఏఎన్ఎం కార్యకర్తలు ఇంటికి వెళ్లి వైద్య పరీక్షలు చేసి తాంబాకు రెండు ఇంజెక్షన్లు వేశారు. అరగంట తర్వాత ఆమె మృతి చెందింది. వారు వేసిన ఇంజెక్షన్ వల్లే తన భార్య మృతిచెందిందని చావ్‌కుమార్ ఆరోపించాడు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు, ఎస్‌డీపీఓ మీనాక్షి ఠాకూర్, తహసీల్దార్ సస్మిత జాని గ్రామానికి చేరుకున్నారు. తన భార్య మరణానికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని భర్త డిమాండ్ చేస్తున్నారు. శవపరీక్ష నివేదిక ఆధారంగా దర్యాప్తు ప్రారంభిస్తామని ఎస్‌డీపీఓ తెలిపారు. తల్లి ఆలనపాలనకు దూరమైన ఆ కవలలను చూసి కుటుంబీకులు రోదిస్తున్న తీరు స్థానికులను కంటతడి పెట్టించింది.


తాంబ మృతదేహం


ఇంజెక్షన్

పెట్టుబడిదారులకు ఎర్రతివాచీ


దీపం వెలిగించి కార్యక్రమం ప్రారంభిస్తున్న సీఎం మోహన్. పక్కన మంత్రి సంపద్, అధికారులు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: పారిశ్రామిక ప్రగతి, ఉపాధి కల్పన ధ్యేయంగా తమ ప్రభుత్వం పెట్టుబడిదారులకు ఎర్ర తివాచీ పరిచిందని ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి చెప్పారు. మంగళవారం రాత్రి భువనేశ్వర్‌లోని మేఫెయిర్ అతిథి భవనంలో టైమ్స్ గ్రూపు సంస్థ బిజినెస్ అవార్డ్స్ ఒడిశా-2024 కార్యక్రమం నిర్వహించింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సీఎం మాట్లాడుతూ రానున్న అయిదేళ్లలో రూ.5 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తాయని, ప్రముఖ కంపెనీలు పరిశ్రమల ఏర్పాటుకు ఉత్సాహం కనబరుస్తున్నాయన్నారు. త్వరలో బెంగళూరు, హైదరాబాదు, దుబాయ్, సింగపూర్‌లలో ఉత్కర్ష ఒడిశా సదస్సులు జరగనున్నాయన్నారు. జనవరిలో భువనేశ్వర్‌లో ఏర్పాటయ్యే పెట్టుబడిదారుల సమావేశంలో ఒప్పందాలు కుదరనున్నాయని మోహన్ చెప్పారు. కార్యక్రమంలో పరిశ్రమల శాఖ మంత్రి సంపద్ స్వయిన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మనోజ్ అహుజా, పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి హేమంతశర్మ, ఇతర అధికారులు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు పాల్గొన్నారు. వాణిజ్య రంగంలో రాణించినవారికి ముఖ్యమంత్రి అవార్డులు అందజేశారు.

రక్తపరీక్ష కోసం నిరీక్షణ


క్యూలో నిల్చొన్న రోగులు

జయపురం, న్యూస్‌టుడే: జయపురంలో జిల్లా ప్రధానాసుపత్రిలో రక్తపరీక్ష కోసం వచ్చిన రోగులకు గంటల కొద్ది నిరీక్షణ తప్పటం లేదు. వైద్య సిబ్బంది కొరతతో పాటు, సరైన గదులు లేక ఈ పరిస్థితి ఏర్పడిందని రోగులు వాపోతున్నారు. ఎన్నికలకు ముందు ఆసుపత్రి ప్రాంగణంలో అన్ని వసతులతో నూతన భవనం నిర్మాణం ప్రారంభమైంది. ఇప్పటికీ భవనాన్ని గుత్తేదారుడు అప్పగించ లేదు. ఆహార కేంద్రాన్ని రక్తపరీక్ష గదిగా మార్చినట్లు సీడీఎంఓ డా. సుశాంత్‌కుమార్ దాస్ తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

డీపీ క్యాంప్‌లో అధ్వానంగా పారిశుద్ధ్యం


మురుగుకాలువ దుస్థితి

సిమిలిగుడ, న్యూస్‌టుడే: సునాబెడ పురపాలక సంస్థ ద్వారా పారిశుద్ధ్యం మెరుగుకు రూ. లక్షలు వెచ్చించిన ఫలితం లేకుండా పోయింది. అధికారుల నిర్లక్ష్యం దీనికి తోడైంది. పురపాలక సంస్థ పరిధి 2వ వార్డులో ఉన్న డీపీ క్యాంప్‌లో గత కొద్ది రోజులుగా పారిశుద్ధ్యం పనులు చేపట్టడం లేదు. కాలువలు నిండి రహదారిపై మురుగు పారి దుర్గంధం వెలువడుతోంది. దోమల బెడద ఎక్కువగా ఉండడంతో రోగాల బారిన పడుతున్నామని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల డెంగీతో అయిదుగురు మృతిచెందారు. ఈ వ్యాధి బాధితులు పెరుగుతున్నప్పటికీ అధికారులు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. దీనిపై యంత్రాంగం చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

బోదవ్యాధిపై అవగాహన



రక్త పరీక్షలు చేస్తున్న వైద్య బృందం

గుణుపురం, న్యూస్‌టుడే: రాయగడ జిల్లా గుణుపురం సమితిలో బోదవ్యాధి నివారణకు జగన్నాథ్‌పూర్ సామాజిక ఆరోగ్యకేంద్ర వైద్య బృందం మంగళవారం సాయంత్రం నుంచి రెగడా పంచాయతీలోని పలు గ్రామాల్లో చైతన్య సదస్సులు, రక్తపరీక్షలు నిర్వహిస్తున్నారు. వైద్యులు భార్గవ్ సాహు, వన విహారి నాయక్, సుకాంత్ కుమార్ పండా, కాళీప్రసాద్ పండా, ఆరోగ్య కార్యకర్త సుస్మితా సేనాపతి, మనోజ్ గౌడొ తదితరులు అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు.

పాఠశాల ఏర్పాటు చేయండి

కొరాపుట్, న్యూస్‌టుడే: కలెక్టరేట్ వద్ద బిరుగుమ్మ సమితి హరిదాపుట్ పంచాయతీకి చెందిన పాటియాసిల్ గ్రామస్థులు జిల్లా పాలనాధికారిని కలిసి వినతిపత్రం అందజేశారు. తమ గ్రామంలో పాఠశాల ఏర్పాటు చేయాలని కోరుతున్నట్లు వినతిపత్రంలో తెలియజేశారు. గ్రామంలో 114 కుటుంబాల్లో 63 మంది విద్యార్థులున్నారని, ఊరికి దగ్గర ఉన్న ప్రభుత్వ పాఠశాల 4 కి.మీ. దూరంలో ఉండడంతో రాకపోకలు ప్రమాదకరంగా మారాయి. విద్యార్థులు మధ్యలోనే చదువులు ఆపేస్తున్నారన్నారు. ఈ సమస్యను దృష్టిలో ఉంచుకొని చర్యలు తీసుకోవాలన్నారు.


కొరాపుట్ కలెక్టరేట్ వద్ద పాటియాసిల్ గ్రామస్థులు

సుభద్ర పథకం నిబంధన సవరణ


మనోజ్ అహూజా

భువనేశ్వర్, న్యూస్‌టుడే: సుభద్ర పథకంలో స్వల్ప సవరణ చేశారు. 2.67 లక్షల మంది ప్రయోజనాలు ధ్యేయంగా ప్రభుత్వం నిబంధన సడలించింది. బుధవారం మధ్యాహ్నం లోక్‌సేవాభవన్‌లో ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి అధ్యక్షతన కేబినెట్ సమావేశం జరిగింది. అనంతరం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) మనోజ్ అహూజా విలేకర్లకు వివరాలు తెలియజేశారు. సుభద్ర కార్యక్రమం కింద 1 కోటి 2 లక్షల మంది మహిళలు దరఖాస్తు చేశారని, ఇంతవరకు 60 లక్షల మందికి రూ.5 వేలు చొప్పున తొలి వాయిదా సొమ్ము చెల్లించామన్నారు. తొలుత విధించిన నిబంధన ప్రకారం చూస్తే 2.67 లక్షల మంది అనర్హులవుతారని, అందరికీ న్యాయం చేసి సొమ్ము చెల్లించాలన్న ధ్యేయంతో కేబినెట్ నిబంధనలు సవరించినట్లు చెప్పారు. ఖరీఫ్ ధాన్యం క్వింటాలకు రూ.3,100లు చెల్లించడానికి ఆమోదముద్ర పడిందని, 4 వేల కొనుగోలు కేంద్రాలు తెరవాలని నిర్ణయమైందన్నారు. జీఎస్టీ చట్టంలో 34 అంశాలు సవరణకు కేబినెట్ ఆమోదించినట్లు సీఎస్ తెలిపారు.

పశువులను రక్షించండి

భువనేశ్వర్, న్యూస్‌టుడే: తుపాను నేపథ్యంలో పశువులను రెండురోజులు బయటకు వదలొద్దని, వాటి సంరక్షణకు యజమానులు జాగ్రత్తలు తీసుకోవాలని మత్స్య, పశుసంవర్ధక శాఖల మంత్రి గోకులానంద మల్లిక్ పేర్కొన్నారు. బుధవారం మూగప్రాణుల భద్రతకు సంబంధించి ఆయన ప్రకటన జారీ చేశారు. గురు, శుక్రవారాల్లో పశువులకు ఇబ్బందులు కలిగితే వెంటనే టోల్‌ఫ్రీ ఫోన్ నెంబరు 1962కి తెలియపర్చాలన్నారు. సంచార పశువైద్య బృందాలను సిద్ధంగా ఉంచామని పేర్కొన్నారు.

భంజనగర్‌లో శీతల గోదాం ప్రారంభం


శిలా ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రద్యుమ్న కుమార్ నాయక్, చిత్రంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లా భంజనగర్‌లోని నియంత్రిత బజారు కమిటీ (ఆర్ఎంసీ) ఆవరణలో కొత్తగా నిర్మాణమైన శీతల గోదాంను బుధవారం భంజనగర్ శాసనసభ్యుడు ప్రద్యుమ్న కుమార్ నాయక్ ప్రారంభించారు. భంజనగర్ సబ్‌కలెక్టరు, ఆర్ఎంసీ అధ్యక్షుడు అనిల్ కుమార్ సెఠి, భంజనగర్ నగర పంచాయతీ (ఎన్ఏసీ) అధ్యక్షుడు గోపబంధు మహాపాత్ర్ తదితరులు పాల్గొన్నారు. రూ.24 లక్షల వ్యయంతో పది మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల ఈ శీతల గోదాంలో వివిధ రకాల కూరగాయలు, పండ్లను ఏడు రోజుల నుంచి ఏడు నెలల వరకూ నిల్వ ఉంచుకునే సౌకర్యం ఏర్పడిందని ఆర్ఎంసీ అధికారులు తెలిపారు.

సునాబెడలో న్యాయ అవగాహన శిబిరం

సిమిలిగుడ, న్యూస్‌టుడే: సీఎన్ఎస్ఆర్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సునాబెడలో గంజాం కాలనీకి చెందిన అంబేడ్కర్ క్లబ్‌లో బుధవారం న్యాయ అవగాహన శిబిరం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పురపాలక సంస్థ అధ్యక్షుడు రాజేంద్రకుమార్ పాత్రో పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. సీడీపీఓ నళినిబెహరా మాట్లాడుతూ మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని కోరారు. ఈ సందర్భంగా న్యాయవాదులు అజయ్ కోసల, కేదార్‌నాథ్ సేనాపతిలు న్యాయపరంగా అనేక అంశాలు, వాటి చట్టాలు, చట్టాల సవరణ తదితర అంశాలు గురించి వివరించారు. కౌన్సిలర్ మమతారాయ్, క్లబ్ అధ్యక్షులు ప్రకాష్ కోసల, సీఎన్ఎస్ఆర్ కోఆర్డినేటర్ సహదేవ్‌బాగ్ తదితరులు ఉన్నారు.


ప్రసంగిస్తున్న న్యాయవాది కేదార్‌నాథ్

యువకుడి ఆత్మహత్య

నవరంగపూర్, న్యూస్‌టుడే: నవరంగపూర్ ఉమ్మర్‌కోట్ ఠాణా పరిధిలో బకద పంచాయతీ సింగరగుడ గ్రామం శివారులోఉన్న అడవిలో చెట్టుకు ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సింగరగుడ గ్రామానికి చెందిన సదన్‌హరిజన్(24) మంగళవారం రాత్రి ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిపోయాడు. తిరిగి రాకపోవడంతో కుటుంబీకులు వెతికారు. సమీప అడవిలో చెట్టుకు వేలాడుతున్న యువకుడిని గ్రామస్థులు గుర్తించి కుటుంబీకులకు సమాచారం అందించారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరీక్షకు పంపారు. అనంతరం పోలీసులు మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభిస్తున్నారు.

విద్యుదాఘాతంతో గురై ఒకరి మృతి

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: ఖరగ్‌పూర్ సబ్ డివిజన్ బెల్దా పరిధిలో గల కాంసింగ్‌పూర్‌కి చెందిన దేవజిత్‌ప్రధాన్(42) విద్యుదాఘాతానికి గురై మంగళవారం మృతిచెందారు. ఇంటి సమీపంలో విద్యుత్ స్తంభం తాకడంతో ఈ ఘటన జరిగింది. పోలీసులు ఖరగ్‌పూర్ సబ్ డివిజన్ ఆసుపత్రిలో శవపరీక్ష జరిపించి బంధువులకు అప్పగించారు.

మరొకరు...: ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: చికిత్స కోసం ఆసుపత్రికి వెళ్లిన మహిళ మృతి చెందిన ఘటన ఖరగ్‌పూర్‌లో జరిగింది. వివరాల్లోకి వెళ్తే ఝూర్‌గ్రామ్ జిల్లా కాలాబనికి చెందిన సుభేదా మహతో(54) స్థానిక ఆసుపత్రికి చికిత్సకు వెళ్లింది. ఆరుబయట మరుగుదొడ్డికి వెళ్లగా అక్కడ కాలు జారి గాయపడింది. వెంటనే స్థానికులు ఆమెను ఝూర్‌గ్రామ్ ఆసుపత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతిచెందిందని పోలీసులు తెలిపారు.

ట్రాక్టర్ - ద్విచక్ర వాహనం ఢీ

నవరంగపూర్, న్యూస్‌టుడే: రహదారి ప్రమాదంలో ముగ్గురు యువకులు గాయపడిన ఘటన నవరంగపూర్ జిల్లా జోరిగావ్ ఠాణా పరిధిలో రతఖంటిగూడ పంచాయతీలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గాటిచాప గ్రామం వద్ద ఉదయం చెరువులో ముగ్గురు యువకులు స్నానం చేసి ద్విచక్రవాహనంపై స్వగ్రామాలకు వెళ్తుండగా అటుగా వస్తున్న చిప్స్ లోడ్ ట్రాక్టర్ వీరిని ఢీకొంది. ఈ ప్రమాదంలో క్షతగాత్రులకు తీవ్ర గాయాలవడంతో స్థానికులు ఉమ్మర్‌కోట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. గాయపడ్డ వారు గాయిగుడి గ్రామానికి చెందిన దేవరాజ్ శంతా, గురుదేవ్ శంతా, ధాయమతి గ్రామానికి చెందిన సురేంద్ర శంతాగా పోలీసులు గుర్తించారు. ప్రాథమిక చికిత్స అనంతరం పరిస్థితి విషమించడంతో దేవరాజ్‌ను నవరంగపూర్ ప్రధానాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

దాడి చేసి పరారైన వ్యక్తి

నవరంగపూర్, న్యూస్‌టుడే: నవరంగపూర్ జిల్లా ఉమ్మర్‌కోట్‌లో బస్సు డ్రైవరుపై కత్తితో దాడి చేసి ఓ వ్యక్తి పరారయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎంఏపీలో ఓ ప్రైవేటు బస్సు డ్రైవరుగా చంద్ర ప్రధాన్ పనిచేస్తున్నాడు. బుధవారం ఉదయం ఉమ్మర్‌కోట్-బ్రహ్మపురానికి బస్సు నడపాల్సి ఉండగా కాలకృత్యాలు తీర్చుకునేందుకు ఉదయం నాలుగు గంటలకు సమీప మరుగుదొడ్డికి వెళ్లాడు. ఈ సమయంలో గుర్తు తెలియని వ్యక్తి హెల్మెట్ ధరించి ద్విచక్రవాహనంపై వచ్చి చంద్ర కడుపులో పొడిచి పరారయ్యాడు. స్థానికులు ఆయనను స్థానిక ఆసుపత్రికి తరలించి అనంతరం వైద్యుల సూచన మేరకు కొరాపుట్ ఆసుపత్రికి చేర్చారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. పాత కక్షలతో దుండగుడు ఈ అఘాయిత్యానికి పాల్పడినట్టు ప్రాథమిక దర్యాప్తులో తేలింది.

పోలీసులకు చిక్కిన చోరులు

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలో కొద్దిరోజుల క్రితం ఓ హార్డ్‌వేర్ దుకాణంలో జరిగిన దొంగతనానికి సంబంధించి పోలీసులు ఇద్దరిని అరెస్టు చేశారు. బుధవారం ఎస్పీ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఎస్డీపీవో ఆర్. సేనాపతి ఈ వివరాలను మీడియాకు వెల్లడించారు. వివరాల్లోకి వెళ్తే స్థానిక రైల్వే స్టేషన్ సమీపాన ఉన్న అశోక్ థియేటర్ వద్ద దుకాణ సముదాయంలోని ఓ హార్డ్‌వేర్ షాపులో ఈ నెల 16వ తేదీన దుండగులు చొరబడి రూ.30 వేల నగదు, ఇతరత్రా సామగ్రి దొంగలించారు. బాధితుడు బి. గుప్తేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. బుధవారం నిందితులు ఇద్దరిని అదుపులోకి తీసుకుని రూ.10 వేల నగదు, ఓడీవీఆర్‌ను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం న్యాయస్థానంలో హాజరుపరిచారు. వీరు బుదరావలసకు చెందిన మహదేవ్ సతీష్, ఎస్.రామకృష్ణగా గుర్తించారు.

అంబులెన్స్‌లో 170 కిలోల గంజాయి స్వాధీనం

సిమిలిగుడ, న్యూస్‌టుడే: అంబులెన్స్‌లో అక్రమ గంజాయి రవాణాను పోలీసులు అడ్డుకున్నారు. నందపూర్ ఎస్డీపీఓ సంబిత్‌కుమార్ మజ్జి అందించిన వివరాల ప్రకారం...నందపూర్ ఠాణా పరిధిలో దేవ్‌గందన ప్రాంతం నుంచి అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్నట్లు సమాచారం అందింది. దీంతో ఏఎస్ ప్రఫుల్‌కుమార్ నేతృత్వంలో మంగళవారం రాత్రి నందపూర్ కళాశాల కూడలి వద్ద పోలీసులు పెట్రోలింగ్ చేస్తున్నారు. అటుగా వెళ్తున్న అంబులెన్స్‌ను చూసి అనుమానంతో తనిఖీలు నిర్వహించగా గంజాయి లభ్యమైంది. చోదకుడు పరారయ్యాడు. తహసీల్దారు అనాదిచరణ్ సాహు సమక్షంలో తూనిక చేయగా 170 కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభిస్తున్నారు.

మల్కాన్‌గిరి, న్యూస్‌టుడే: మల్కాన్‌గిరి జిల్లా అబ్కారీ శాఖ తనిఖీల్లో గంజాయి స్వాధీనం చేసుకొని ఒకరిని అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళ్తే బుధవారం ఉదయం అబ్కారీ బృందం మల్కాన్‌గిరి పట్టణంలో పెట్రోలింగ్ చేస్తున్న సమయంలో పట్టణంలో ముఖ్య రహదారిపై తరిణి మందిరం దగ్గర ఓ ఆటో అతివేగంగా వెళ్తుండం గమనించారు. ఆటోని ఆపి తనిఖీ చేయగా రెండు బస్తాల గంజాయి స్వాధీనం చేసుకొని చోదకుడిని అరెస్టు చేశారు. మొత్తం రెండు బస్తాల్లో 50 కిలోల గంజాయి చిత్రకొండ ప్రాంతం నుంచి ఛత్తీస్‌గఢ్‌కి తరలిస్తున్నట్లు విచారణలో తెలిసింది. నిందితుడిని న్యాయస్థానానికి తరలించినట్టు అబ్కారీ శాఖ తెలిపింది.

పల్టీ కొట్టిన ట్రక్కు

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: అదుపు తప్పి ఓ ఆలూ ట్రక్కు పల్టీకొట్టి గోతిలో పడిన ఘటన ఖరగ్‌పూర్‌లో జరిగింది. వివరాల్లోకి వెళ్తే బీర్‌భూమ్ జిల్లా కమల్‌పుకుర్ ప్రాంతం నుంచి ఒడిశాకు ఓ ఆలూ ట్రక్కు వెళ్తుండగా ఖరగ్‌పూర్ సబ్‌డివిజన్ దాస్‌పూర్‌లో చందిపూర్ వద్ద ఈ ఘటన జరిగింది.

మొక్కజొన్న రైతుల్లో ఆందోళన


ఆరబెడుతున్న కంకులు

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: బంగాళాఖాతంలో ఏర్పడిన దానా తుపానుతో గజపతి జిల్లా మోహన సమితి మలాసపదర్ పంచాయతీ హలపంకల గ్రామానికి చెందిన మొక్కజొన్న రైతులు భయాందోళన చెందుతున్నారు. నష్టం వాటిల్లకుండా రైతులు ముందుగానే కంకులు సేకరిస్తున్నారు. కోసిన వాటిని బండరాళ్లపై, ఇంటి పైకప్పులపై ఆరబెట్టే పనిలో ఉన్నారు.

ప్రధానోపాధ్యాయుడిపై వేటు

రాయగడ గ్రామీణం, న్యూస్‌టుడే: రాయగడ సమితి బైరాగి హలువ పంచాయతీ బాలుమతి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జె.గోపాల్‌పై వేటు పడింది. విధులు సక్రమంగా నిర్వహించకపోవడంతో ఆయన్ను విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి డి.బసంతకుమార నాయక్ తెలిపారు. జురిడి మాధ్యమిక పాఠశాలకు చెందిన సుభాష్‌చంద్ర బిడికతో పాటు జనతా ప్రాథమిక పాఠశాలకు చెందిన అర్చన పండాకి జీతాలు నిలిపివేసినట్లు డీఈఓ బసంత తెలిపారు. వీరితో పాటు రంగులోడి, కంటువ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

మునిగుడ బీడీవోగా కృష్ణచంద్ర



రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: రాయగడ జిల్లా మునిగుడ సమితి అభివృద్ధి అధికారి(బీడీవో)గా **కృష్ణ చంద్ర దళపతి** బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహించిన బీడీవో ప్రీతమ్‌కుమార్ తంటి సంబల్‌పూర్‌కు బదిలీ అయ్యారు.

అగ్నిమాపకశాఖ ఆధ్వర్యంలో శిక్షణ శిబిరం

జయపురం, న్యూస్‌టుడే: జయపురం జిల్లా ప్రధానాసుపత్రిలో బుధవారం అగ్నిమాపకశాఖ తరఫున శిక్షణా శిబిరం నిర్వహించారు. అగ్నిప్రమాదం జరిగితే మంటలను ఎలా నియంత్రించాలని, రోగులను సురక్షితంగా తరలించే విధానంపై, అగ్నిమాపక పరికరాలను ఉపయోగించడంపై ఆసుపత్రి సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. డీఎంవో డా.రబీంద్రనాథ్ మిశ్రా, మేనేజర్ రూప్సిమధుమిత, డీహెచ్‌హెచ్ ఫైర్ సేఫ్టీ మేనేజర్ రమాకాంత్ తదితరులు హాజరయ్యారు.


రోగిని తరలించే విధానాన్ని వివరిస్తున్న సిబ్బంది

ఒడియా వార పత్రిక 'దక్షిణాంచల్ ఎక్స్‌ప్రెస్' ఆవిష్కరణ



పత్రికను ఆవిష్కరిస్తున్న అతిథులు, నిర్వాహకులు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: ఒడియా వార పత్రిక 'దక్షిణాంచల్ ఎక్స్‌ప్రెస్' ఆవిష్కరణోత్సవం బుధవారం నిర్వహించారు. మధ్యాహ్నం హిల్‌పట్నాలోని సహీదు లక్ష్మణ నాయక్ సామాజిక భవనంలో ఇది ఏర్పాటైంది. బిజద నాయకుడు సుబాష్ మహారణా, భాజపా నాయకుడు కన్హుచరణ పతి, సీనియరు జర్నలిస్టులు చంద్రధ్వజ సాహు, శక్తిధర రాజగురు, అభయ పాఢి, అశోక్ బ్రహ్మ, సుదీప్ కుమార్ సాహు పాల్గొని ఆవిష్కరించారు. ఇంకా ఇందులో పత్రిక సంపాదకుడు మనోజ్ కుమార్, సహాయ సంపాదకురాలు రీనారాణి సాహు తదితరులు పాల్గొని మాట్లాడారు.

హింసకు దూరంగా ఉండండి



బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లా నిమ్మఖండి ఠాణా పరిధిలోని పుల్టా గ్రామంలో రెండు వర్గాల మధ్య నెలకొన్న విభేదాలు భగ్గుమన్నాయి. ఇటీవల ఇరు వర్గాలు ఒకరిపైనొకరు పరస్పరం నాటు బాంబులతో దాడులు చేసుకోగా, గ్రామంలో అశాంతి పరిస్థితులు నెలకొన్నాయి. ఈ పరిస్థితిని చక్కదిద్ది, గ్రామంలో శాంతిస్థాపనకు పోలీసు యంత్రాంగం చర్యలు చేపట్టింది. మంగళవారం గ్రామంలోని మందిరం ఆవరణలో నిర్వహించిన శాంతి కమిటీ సమావేశంలో ఎస్పీ శరవణ వివేక్ ఎం. పాల్గొని మాట్లాడారు. ఉభయ వర్గాలు విభేదాలు వీడాలని, హింసకు దూరంగా ఉండాలని, చట్టాన్ని చేతుల్లోకి తీసుకోరాదని గ్రామస్థులకు సూచించారు.

● **బ్రహ్మపుర నగరం:** దక్షిణ ఒడిశా, గంజాం జిల్లాపై ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలని, దీని సమగ్ర అభివృద్ధికి చర్యలు చేట్టాలని వివిధ సంస్థల ప్రతినిధులు డిమాండు చేశారు. మంగళవారం సాయంత్రం ఆయా సంస్థల ప్రతినిధులు కళ్లికోట వర్సిటీ మైదానం గ్యాలరీ వద్ద ఓ సమావేశాన్ని నిర్వహించారు. ●బ్రహ్మపురలోని కళ్లికోట వర్సిటీ మైదానంలో వచ్చే నవంబరు ఒకటి నుంచి 10వ తేదీ వరకూ '11వ బ్రహ్మపుర మహానగర పుస్తక మేళా' జరుగుతుంది. ఇందుకోసం మంగళవారం వర్సిటీ మైదానంలో భూమిపూజ నిర్వహించారు. మేళా కమిటీ అధ్యక్షుడు సుశాంత దాస్, కార్యదర్శి అజిత కుమార్ సాబత్, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు. ● **బ్రహ్మపుర నగరం:** జిల్లాలో జనాల రద్దీగా ఉండే ప్రాంతాల్లో ఎటువంటి అనుమతులు లేకుండా బాణసంచా అక్రమ నిల్వలు, అమ్మకాలపై పోలీసులు దాడులు చేశారు. బ్రహ్మపుర పెద్దబజారు ఠాణా పరిధిలో రెండు చోట్ల, బి.ఎన్.పూర్ ఠాణా పరిధిలో ఒకటి, జరడా ఠాణా పరిధిలో మూడు చోట్ల దాడులు నిర్వహించారు. ఆయా దాడుల్లో ఆరుగురికిపై క్రిమినల్ కేసులు నమోదు చేశామని ఎస్పీ శరవణ వివేక్ ఎం. బుధవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు.

మౌలిక వసతులు కల్పించాలని గ్రామస్థుల ఆవేదన


వాగువద్ద నీటిని తీసుకెళ్తున్న రచమా గ్రామస్థులు

గుణుపురం, న్యూస్‌టుడే: రాయగడ జిల్లా గుడారి సమితిలో పలు గ్రామాల ప్రజలు కనీస వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారు. గుడారి సమితి మధువన పంచాయతీ కేంద్రానికి సుమారు పదిహేను కిలోమీటర్లలో రచమా గ్రామం ఉంది. ఈ ఊరికి సరైన రహదారి సౌకర్యం లేదు. కేవలం ద్విచక్రవాహనం వెళ్లేందుకు ఆస్కారం ఉంది. ఇక్కడ ముప్పైకి పైగా కుటుంబాలు ఉన్నాయి. తాగునీటి సదుపాయం లేదు. చేతి పంపు ఉన్నా పనిచేయడం లేదు. పాఠశాలలు శిథిలావస్థకు చేరుకున్నాయి. వైద్యం అందనంత దూరంలో ఉంది. గతంలో సోలార్ ప్రాజెక్టు ద్వారా లైట్లు వేశారు. ఆరేడు నెలలుగా ఇవి పనిచేయడం లేదు. మౌలిక వసుతుల కల్పనలో అధికారులు విఫలమయ్యారని గ్రామస్థులు వాపోతున్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలని జిల్లా సీపీఐఎమ్ఎల్ లిబరేషన్ కార్యదర్శి తిరుపతి గమాంగ్ డిమాండ్ చేశారు.

వన్యప్రాణుల రక్షణకు చర్యలు


బితర్‌కనికా అభయారణ్యం

భువనేశ్వర్, న్యూస్‌టుడే: 'దానా' తుపాను ధమ్రా, బితర్‌కనికాల మధ్య తీరం దాటనుందని వాతావరణ అధ్యయన శాఖ (ఐఎండీ) బుధవారం స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో అటవీశాఖ వన్యప్రాణుల రక్షణకు చర్యలు చేపట్టింది. బితర్‌కనికా వృక్షసంపదకు నిలయం. వన్యప్రాణులు, పక్షులు పుష్కలంగా ఉన్నాయి. తుపాను ఇక్కడ తీరం దాటుతుందన్న అంచనా ఉన్నందున మూగప్రాణులకు ముప్పుగా పరిణమించే పరిస్థితి లేకపోలేదు. దీనిపై ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ (డీసీసీఎఫ్) సుశాంత్‌నంద్ బుధవారం భువనేశ్వర్‌లో విలేకర్లతో మాట్లాడుతూ.. వన్యప్రాణుల రక్షణకు ముందుజాగ్రత్తలు చేపట్టామన్నారు. బితర్‌కనికాలో లేళ్లు, జింకలు అధికంగా ఉన్నాయని, ఇవి సున్నితమైన ప్రాణులని, వీటి సంరక్షణకు చర్యలు తీసుకున్నామన్నారు. పక్షులు పెద్ద సంఖ్యలో ఉన్నాయని, ఇది పునరుత్పత్తి సమయమని, గాలుల తీవ్రత వల్ల చెట్ల పైనుంచి గుడ్లు కింద పడి పాడయ్యే అవకాశం ఉందన్నారు. యంత్రాంగం నష్ట నివారణ, వన్యప్రాణులు, పక్షుల రక్షణకు గట్టి చర్యలు చేపట్టిందన్నారు.

సత్కర్మలతో సుఖసంతోషాలు


ఆధ్యాత్మికోపన్యాసం చేస్తున్న సద్గురు గురు శరణానంద సరస్వతి

గోపాలపూర్, న్యూస్‌టుడే: సత్కర్మలు ఆచరించే వారికి సుఖ సంతోషాలుంటాయని, ఉత్తమ ఫలితాలు తథ్యమని సద్గురు గురు శరణానంద సరస్వతి చెప్పారు. బుధవారం గోపాల్‌పూర్‌కి చేరువలోని బక్షిపల్లి గ్రామంలో స్వామి చిదానంద భక్తుడు బి.ఆదినారాయణ సంస్మరణ సభ జరిగింది. ఇందులో పాల్గొన్న శరణానంద మాట్లాడారు.

సందడిగా నందన్న ఉత్సవాలు

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: పర్లాఖెముండి పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో నందన్న ఉత్సవాలు సందడిగా నిర్వహిస్తున్నారు. ప్రత్యేక పూజలు చేస్తున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఏడురోజులు పూర్తవుతున్న నేపథ్యంలో నందన్నకు గంగమ్మ చెంతకు చేర్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో బ్రాహ్మణదేయి అమ్మవారి ఉత్సవం

జయపురం, న్యూస్‌టుడే: జయపురం సమితి ఉమురి ప్రజల ఆరాధ్య దేవి 'మా బ్రహ్మణదేయి' అమ్మవారు ఉత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. రాత్రి రావణ దహన కార్యక్రమంలో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. శాసనసభ్యుడు తారాప్రసాద్ వాహినిపతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం జరిగిన దేశీ నాటకం అందరినీ ఆకర్షించింది. అమ్మవారికి మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు ఈశ్వర్ బాగ్ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ జరిగింది.


దహనానికి సిద్ధం చేసిన రావణుడి దిష్టిబొమ్మ


కొరసొండలో ప్రత్యేక వేషధారణలో కళాకారులు

తుపాను అప్రమత్తత


ప్రచారం చేస్తున్న పోలీసులు

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: దానా తుపాను ప్రభావం పశ్చిమ, తూర్పు మిడ్నాపూర్, ఝూర్‌గ్రామ్ జిల్లాలపై అధికంగా ఉంటుందని వాతావరణం కేంద్రం ప్రకటించింది. దీంతో గురు, శుక్ర, శనివారాలు భారీ వర్షాలు కురుస్తాయని, 100 నుంచి 120 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని అప్రమత్తత చేసింది. తూర్పు మిడ్నాపూర్‌లో ప్రముఖ పర్యాటక కేంద్రం దిఘాలో రెడ్ ఎలెర్ట్ ప్రకటించింది. పర్యాటకులు సముద్రం వైపునకు వెళ్లకుండా కోస్ట్‌గార్డులు పహారా కాస్తున్నారు. పశ్చిమ మిడ్నాపూర్ జిల్లా దాంతన్, కేసియాడీ, మోహన్‌పూర్ తదితర ప్రాంతాల్లో తుపాను ప్రభావం అధికంగా ఉంటుందని జిల్లా యంత్రాంగం ప్రకటించింది. కంట్రోల్ రూమ్ తెరిచింది. తీరప్రాంతంలో ఉన్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించింది. రాష్ట్రప్రభుత్వం విద్యాసంస్థలకు నాలుగు రోజుల పాటు సెలవులు ప్రకటించింది.

హబిషార్థులు, సేవాయత్‌ల సేవల్లో హైటెక్ ఆసుపత్రి



ఉచిత చికిత్స కేంద్రం ప్రారంభ కార్యక్రమంలో హైటెక్ సంస్థ అధినేత తిరుపతి, ఏడీఎం శరత్‌చంద్ర, ఇతర అధికారులు, సేవాయత్‌లు

గోపాలపూర్, న్యూస్‌టుడే: హబిషార్థులు, సేవాయత్‌లకు ఆరోగ్య సేవలు అందించడమే ధ్యేయంగా హైటెక్ గ్రూపు పూరీ శ్రీక్షేత్ర పరిక్రమణ మార్గంలో ఉచిత శిబిరం ప్రారంభించింది. మంగళవారం రాత్రి ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో హైటెక్ గ్రూపు సంస్థల అధినేత డా.తిరుపతి పాణిగ్రహి, పూరీ జిల్లా అదనపు పాలనాధికారి (ఏడీఎం) శరత్‌చంద్ర మహాపాత్ర్, సహాయ పాలనాధికారి రాకేష్‌కుమార్ పండా, హైటెక్ సంచాలకుడు సంతోష్‌కుమార్ చౌదరి, సేవాయత్ సంఘం ప్రతినిధి రామచంద్రదాస్ మహాపాత్ర్, హైటెక్ పాలనా ట్రస్టీ సురేష్‌కుమార్ పాణిగ్రహి పాల్గొన్నారు. ఈ సందర్భంగా తిరుపతి పాణిగ్రహి మాట్లాడుతూ పుణ్యక్షేత్రం పూరీలో యాత్రికుల ఆరోగ్యసేవలు ధ్యేయంగా అత్యాధునిక సౌకర్యాలతో 100 పడకల ఆసుపత్రి నిర్మాణం చేయనున్నామన్నారు.

ఆకట్టుకున్న సురభి ఉత్సవాలు


అలరించిన సంప్రదాయ నృత్యాలు

కొరాపుట్, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలో బుధవారం సమితిస్థాయి సురభి ఉత్సవాలు ముగిసాయి. కొరాపుట్ సమితిలో ఉత్సవాలు ఘనంగా జరిగాయి. గిరిజన సంప్రదాయ నృత్యాల పోటీలు, చిత్రలేఖనం, వ్యాసరచన తదితర పోటీల్లో విద్యార్థులు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా జడ్పీ ఛైర్మన్ సస్మిత మెలక హాజరయ్యారు. వీటిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన బృందాలు, విద్యార్థులను జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం కల్పిస్తారని జిల్లా విద్యాశాఖ అధికారి ప్రమోద్ అన్నారు.

మహిళా కమిషన్ సభ్యుల తొలగింపు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి మోహన్‌చరణ్‌మాఝి బుధవారం రాత్రి మహిళా కమిషన్ అధ్యక్షురాలు మినతి బెహరా, ఇతర సభ్యులను తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. బిజద పాలనా కాలంలో మినతి, ఇతర సభ్యులు నియమితులయ్యారు.

ఉచిత శిక్షణ...ఉద్యోగావకాశాలు

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: ఒడిశా స్కిల్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో స్టోర్ అసోసియేట్ ఫార్మసీ కోర్సులో బొల్లినేని మెడ్ స్కిల్స్ ఉచిత శిక్షణ, ఉద్యోగ అవకాశం కల్పిస్తుంది. ఈ అవకాశం ఒడిశా రాష్ట్రంలోని ప్రతి ఒక్క జిల్లాకు చెందుతుందని, ఇంటర్, డీగ్రీ చదివిన వారు అర్హులని తెలిపారు. 18-35 ఏళ్ల యువతీ యువకులు దరఖాస్తు చేసుకోవచ్చు. శ్రీకాకుళం జెమ్స్ ఆసుపత్రి ప్రాంతంలో శిక్షణతో ఉచిత భోజన వసతి సదుపాయం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. దీంతో పాటు విశాఖపట్నంలోని ద్వారక బస్టాండు ప్రాంతంలోని స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్‌లో హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఇంటర్ పూర్తిచేసిన విద్యారులకు బీఎస్సీ, డిప్లొమా పారామెడికల్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు అన్నారు. ఆసక్తిగలవారు జెమ్స్ ఆసుపత్రి ప్రాంగణంలోని తమ సంస్థ నందు పేర్లు నమోదు చేసుకోవాలని, పూర్తి వివరాల కోసం 8008889395, 8247656581, 7995013422 నంబర్లకు సంప్రదించాలని సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు.

మావోయిస్టుల డంప్ స్వాధీనం

మల్కాన్‌గిరి, న్యూస్‌టుడే: మల్కాన్‌గిరి జిల్లా చిత్రకొండ సమితి ఘనబెడ, గురాసేతు బీఎస్‌ఎఫ్ జవానులు మావోయిస్టు డంప్ స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే... బుధవారం ఉదయం ఘనబెడ, గురాసేతు 177 బీఎస్‌ఎఫ్ బెటాలియన్ జవాన్లు కొండకంబేరు అడవిలో కూంబింగ్ ఆపరేషన్ చేస్తున్న సమయంలో ఓ చెట్టు వద్ద మట్టిలో ఈ డంప్ గమనించారు. ఆ స్థలంలో తవ్విన తర్వాత ఓ డ్రమ్‌లో ఉన్న రెండు టిఫిన్ బాంబులు, మూడు పైపు బాంబులు, 9 డిటోనేటర్లు, 9 జిలెటిన్‌స్టిక్‌లు, 10 మీటర్ల కరెంటు తీగ, ఒక సోలార్ ప్లేట్ స్వాధీనం చేసుకున్నారు.

ఇంటింటికీ ఆయుష్ సేవలు

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: ఆయుష్ సేవలు ఇంటింటికీ చేరేలా కేంద్రం చర్యలు చేపట్టింది. సంబంధిత కరపత్రాలు, పుస్తకాలు జిల్లా కేంద్రానికి వచ్చినట్లు వైద్యాధికారిణి సుశీల తెలిపారు. జిల్లాలోని ఏడుగురు ఆయుష్ విభాగం వైద్యాధికారుల పర్యవేక్షణలో 37 పీహెచ్‌సీల్లోని ఆశా కార్యకర్తలకు త్వరలో శిక్షణ ఇస్తామన్నారు.

లిఫ్ట్‌లో ఇరుక్కొని మృతి

కరీంనగర్ నేరవార్తలు, న్యూస్‌టుడే: ప్రమాదవశాత్తు లిఫ్ట్‌లో ఇరుక్కొని వ్యక్తి మృతి చెందిన ఘటన కరీంనగర్‌లో చోటుచేసుకుంది. తెలంగాణా రాష్ట్రంలోని కరీంనగర్ జిల్లా కరీంనగర్ పట్టణ ఒకటో టౌన్ సీఐ కోటేశ్వర్ కథనం ప్రకారం.. ఒడిశా రాష్ట్రంలోని నలగర ప్రాంతానికి చెందిన బనమాలి మాతాన్ (54).. రెండేళ్లుగా కరీంనగర్‌లోని ఓ హోటల్‌లో పని చేస్తున్నారు. రాజీవ్‌చౌక్ సమీపంలోని ఓ భవనంపై అద్దెకు ఉంటున్నారు. మంగళవారం అర్ధరాత్రి విధులు ముగించుకొని వెళ్లి ఇంటి వద్ద లిఫ్ట్ ఎక్కారు. లిఫ్ట్ ఒక్కసారిగా కిందకు పడిపోయిన క్రమంలో లిఫ్ట్ మధ్యలో మాతాన్ ఇరుక్కొని అక్కడికక్కడే దుర్మరణం చెందారు. ఈ మేరకు బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో భవన యజమానిపై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

కట్టెలే కాలిబాటలు..!



గుమ్మగెడ్డ కాలువపై ఉన్న కట్టెలపై నడుస్తున్న మహిళలు



పాతపట్నం మండలం అత్తిసూరి కవిటి గ్రామానికి ఆనుకుని ఒడిశా నుంచి వచ్చే గుమ్మగెడ్డ ఉంది. గ్రామానికి చెందిన సుమారు 300 ఎకరాల పంట పొలాలు ఈ గెడ్డ అవతలి వైపు ఉన్నాయి. గ్రామం నుంచి పంట పొలాలకు వెళ్లి రావాలంటే గెడ్డను దాటాల్సిందే. వర్షాకాలంలో ఇందులో నీటి ప్రవాహం ఎక్కువగా ఉంటుంది. రాకపోకలకు స్థానిక రైతులు వెదురు కర్రలతో కాలిబాటను ఏర్పాటు చేశారు. అధికారులు స్పందించి కాజ్‌వే నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు. మంగళవారం గ్రామంలో జరిగిన సదస్సుకు హాజరైన ఎమ్మెల్యే మామిడి గోవిందరావుకు స్థానిక రైతులు సమస్యను వివరించారు. క్షేత్రస్థాయిలో పరిశీలించిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే చెప్పారు. – న్యూస్‌టుడే, పాతపట్నం

అధ్వానానికి అద్దం

ఇచ్ఛాపురం నియోజకవర్గంలో ఏజెన్సీ ప్రాంతంలోని గ్రామాల రహదారులు ఛిద్రమై, అస్తవ్యస్తంగా తయారయ్యాయి. సోంపేట, కంచిలి మండల పరిధిలోని గ్రామాల దారులు దారుణ స్థితికి చేరుకున్నాయి. తిత్లీ తుపానుకు ధ్వంసమైన కల్వర్టులు ఇప్పటికీ పునరుద్ధరించకపోవడంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. –న్యూస్‌టుడే, సోంపేట



పైడిగాం వద్ద విరిగిన కల్వర్టు

★ అస్తవ్యస్తంగా గిరిజన గ్రామాల రహదారులు

తప్పని అవస్థలు

సోంపేట మండలం ఎంజీపురం పంచాయతీ పరిధిలో ఏజెన్సీ ప్రాంతాలు శ్రీరామ్ నగర్ కాలనీ, బాతుపురం, ఎంజీపురం, కొరాబంద ప్రజలు రహదారులపై రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సవరబాలిగాంకు రోడ్డు నిర్మించాలని ఏళ్ల తరబడిగా కోరుతున్నా.. పట్టించుకోవడం లేదు. బాతుపురం-శ్రీరామ్‌నగర్ కాలనీ కల్వర్టు పూర్తిగా ధ్వంసం కావడంతో ఎంజీపురం గిరిజన ఆశ్రమపాఠశాల విద్యార్థులకు వెళ్లి, వచ్చే సమయంలో అవస్థలు తప్పడం లేదు.

ప్రభుత్వం అనుమతి

మాలగోవిందపురం, నువాగడ తదితర పంచాయతీల పరిధిలో రహదారులు మెరుగు పరిచేందుకు చర్యలు తీసుకుంటాం. మరమ్మతులు చేయడంతోపాటు ఇతర నిర్వహణ పనులు చేపట్టేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది.

-రామినాయుడు, డీఈఈ, ఆర్అండ్‌బీ

రాకపోకలకు నరకం

★ పైడిగాం వద్ద కల్వర్టు విరగడంతో కొత్తబాతుపురంతో పాటు ఇతర గ్రామాలకు ద్విచక్ర వాహనాలపై రాకపోకలు కష్టతరంగా మారాయి.

★ ఎంజీపురం మార్గంలో తేలియాడిన రాళ్లు, తెగిన రోడ్డు భాగాలు, గోతులతో రవాణాకు ఇబ్బందులు కలుగుతున్నాయి.

★ కంచిలి మండలం నువాగడ పంచాయతీ పరిధిలో నాలుగు రహదారుల పరిస్థితి వర్ణనాతీతంగా మారింది. జలంత్రకోట నుంచి నువాగడ పంచాయతీ గ్రామాలకు వెళ్లే రహదారి గోతులమయంగా మారడంతో ప్రమాదాలకు గురవుతున్నారు.

★ కుమ్మరినౌగాం, బొగాబని పంచాయతీ రంగమెటియా ఇతర మన్యం రహదారులకు దశాబ్దకాలంగా మరమ్మతులు చేయలేదు.



రూపు కోల్పోయిన కంచిలి మండలం నువాగడ మార్గం

కాగితం లోడు లారీ దగ్ధం: ప్రాణాలతో బయటపడ్డ చోదకుడు

రాయగడ పట్టణం, మునిగుడ, న్యూస్‌టుడే: కాగితం లోడుతో వెళుతున్న లారీ మునిగుడ సమితి పరిధిలోని బృందాబడి కూడలి వద్ద బుధవారం రాత్రి దగ్ధమైంది. రాయపూర్ నుంచి జె.కె.పూర్ వెళుతున్న ఈ లారీ విద్యుత్తు షార్ట్ సర్క్యూట్ వల్ల కాలిపోయింది. సకాలంలో చోదకుడు సంతోష్‌కుమార్ కిందకు దిగి దూరంగా వెళ్లిపోవడంతో ప్రాణాలతో బయటపడ్డాడు.

ఉన్నవి మూడు.. నిర్వహణ తీరు చూడు..!

● జిల్లాలో దయనీయంగా రైతుబజార్లు ● నిర్లక్ష్యం చూపిన గత ప్రభుత్వం

ఆరుగాలం శ్రమించి రైతన్న పండించిన ఉత్పత్తులను మధ్యవర్తులు, దళారుల ప్రమేయం లేకుండా నేరుగా అమ్ముకునేందుకు వీలుగా ఏర్పాటు చేసిన రైతుబజార్లు జిల్లాలో దయనీయంగా మారాయి. అప్పటి తెదేపా ప్రభుత్వం అటు రైతులు, ఇటు వినియోగదారులకు ఉపయుక్తంగా ఉండాలని తీసుకొచ్చిన ఇవి నిర్వహణ లేక అధ్వానంగా దర్శనమిస్తున్నాయి.. గత పాలకుల నిర్లక్ష్యంతో లక్ష్యం నీరుగారిపోయింది. ఉన్నవాటిలో సమస్యలు వేధిస్తుండగా, మిగిలిన పట్టణాల్లో ఏర్పాటు చేస్తామన్న ప్రతిపాదనలు కాగితాలకే పరిమితం అయ్యాయి. ప్రస్తుత మార్కెటింగ్ శాఖ మంత్రి అచ్చెన్న జిల్లాకు చెందిన వ్యక్తే కావడంతో రైతుబజార్లపై దృష్టిసారించాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

– ఈనాడు డిజిటల్ శ్రీకాకుళం, న్యూస్‌టుడే కలెక్టరేట్, ఆమదాలవలస

జిల్లాలో శ్రీకాకుళం, ఆమదాలవలస, కోటబొమ్మాళిలో మూడు రైతుబజార్లు ఉన్నాయి. వీటి నిర్వహణ గత ఐదేళ్లు పూర్తిగా గాలికొదిలేశారు. ఒక్క శ్రీకాకుళంలో ఉన్నదే అరకొర వసతులతో నడుస్తోంది. ఆమదాలవలసలో పేరుకే ఉంది. మొన్నటి వరకు కోటబొమ్మాళిలో నిరుపయోగంగా ఉండటంతో 'ఈనాడు'లో వచ్చిన కథనంతో మంత్రి అచ్చెన్న స్పందించి అమ్మకాలు చేపట్టేలా చర్యలు తీసుకున్నారు. పలాస, ఇచ్ఛాపురం, టెక్కలి, నరసన్నపేట పట్టణాలు రోజురోజుకూ విస్తరిస్తున్నా రైతుబజార్లు ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం లేదు.



జిల్లా కేంద్రంలోని రైతు బజారులో మూలకు చేరిన తాగునీటి సౌకర్యం

రైతుబజార్ల ద్వారా ఒక నెలకు సమకూరే ఆదాయం, ఖర్చులు (ఆగస్టు నెల) (రూ.)

ప్రాంతం	దుకాణాల సంఖ్య	ఖాళీగా ఉన్నవి	ఆదాయం	ఖర్చు
శ్రీకాకుళం	99	3	1,58,040	55,477
ఆమదాలవలస	69	61	4,800	37,772
కోటబొమ్మాళి	42	26	20,800	46,385

ఆదాయం రూ.4వేలు ఖర్చు రూ.40వేలు

ఆమదాలవలస రైతుబజారులో 69 దుకాణాలు ఉండగా కేవలం నలుగురు మాత్రమే విక్రయాలు చేపడుతున్నారు. ఇందుకు కారణం నిర్మాణాలు శిథిలావస్థకు చేరడం, వసతులు లేమి వెంటాడుతున్నాయి. రూ.లక్షల వ్యయంతో చేపట్టిన దుకాణాలు నిరుపయోగంగా మారిపోయాయి. నాలుగు దుకాణాలకు మార్కెటింగ్ శాఖకు నెలకు రూ.4,800 ఆదాయం వస్తుంది. ఇద్దరు సెక్యూరిటీ సిబ్బంది, స్వీపర్, కరెంటు బిల్లు, ఇతర ఖర్చులకు నెలకు రూ.40 వేల వరకు చూపుతున్నారు. ఏడాదికి రూ.4 లక్షలకుపైగా వ్యయం అవుతోంది. కోటబొమ్మాళిలో నెలకు రూ.20 వేల వరకు ఆదాయం వస్తే ఖర్చు రూ.46 వేలు చూపుతున్నారు. మూడు దుకాణాల ద్వారా నెలకు మార్కెటింగ్ శాఖకు రూ.1,83,640 వరకు ఆదాయం సమకూరుతుంది. ఒక్క శ్రీకాకుళం నుంచే రూ.1,58,040 వరకు ఆదాయం వస్తుంది.

★ రైతుబజార్లలో తాగునీరు, మరుగుదొడ్లు, డ్రైనేజీలు, పార్కింగ్ ప్రదేశం, క్యాంటీన్లు, బేకరీలు, ప్రకటనల బోర్డులు, ఏటీఎం సెంటర్లు వంటి సదుపాయాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. జిల్లాలో ఎక్కడా ఇలాంటి సదుపాయాలు కనిపించలేదు. వీటి ద్వారా ఆదాయం సమకూరే అవకాశమున్నా చర్యలు తీసుకోలేదు.



శిథిలస్థితికి చేరిన ఆమదాలవలస రైతు బజారు

ఆధునికీకరణ చేపడితే మేలు..

శ్రీకాకుళం నగరంలోని ఇల్లీసుపురం వద్ద ఉన్న రైతుబజారు సమస్యలకు నిలయంగా మారింది. ఇక్కడ 99 దుకాణాలు ఉండగా 38 వరకు అద్దెప్రాతిపదికన ఇతరులకు ఇచ్చారు. రైతుబజారు ప్రాంతం ఆధునికీకరణ చేపట్టకపోవడంతో లోతట్టుగా తయారైంది. ప్రధాన రహదారి కంటే కిందకు ఉండటంతో వర్షం పడితే చెరువును తలపిస్తుంది. ఆధునికీకరణకు చొరవ చూపడంలేదు. గత కొద్ది నెలలుగా తాగునీటి కొరత వేధిస్తోంది.



టెక్కలిలో తుప్పలతో నిండి.. నిర్మానుష్యంగా మారి..

ప్రతిపాదనలకే పరిమితం..

★ **పలాస:** రైతుబజారు ఏర్పాటుకు అప్పటి తెదేపా ప్రభుత్వం ప్రతిపాదనలు చేసింది. దీనికి స్థలాన్ని కేటాయించినా కోర్టులో వివాదం వల్ల కొలిక్కిరాని పరిస్థితి. వైకాపా సర్కారు వచ్చిన తర్వాత అప్పటి మంత్రి సీదిరి అప్పలరాజు కాశీబుగ్గ కూడలి వద్ద ఉన్న ప్రాథమిక పాఠశాల ఆవరణలో రైతుబజారు పేరిట ఆర్భాటం చేసినా పదిరోజులకే పరిమితమైంది.

★ **ఇచ్ఛాపురం:** ఎంపీడీవో కార్యాలయం ఖాళీ స్థలంలో పెట్టాలని ప్రతిపాదించినా కాగితాలకే పరిమితమైంది. రెవెన్యూ అధికారులు స్థలాన్ని కేటాయిస్తే మార్కెటింగ్ అధికారులు సిద్ధంగా ఉన్నట్లు చెబుతున్నారు.

★ **టెక్కలి:** అప్పటి తెదేపా హయాంలో చేపట్టిన రైతుబజారు పూర్తయినప్పటికీ స్థల వివాదంతో కొందరు కోర్టును ఆశ్రయించడంతో నిరుపయోగంగా మారిపోయింది.

చర్యలు తీసుకుంటాం

రైతుబజార్ల ఆధునికీకరణకు ప్రతిపాదనలు తయారు చేశాం. రక్షణ గోడలు, మరుగుదొడ్లు, తాగునీరు వంటి సదుపాయాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. ఆమదాలవలసలో రైతులను ప్రోత్సహిస్తున్నా ముందుకురావడంలేదు. పలాస, ఇచ్ఛాపురంలో స్థలం చూపితే నిర్మాణ పనులు ప్రారంభిస్తాం. టెక్కలిలో పూర్తయినప్పటికీ కోర్టులో ఉండటంతో నిర్వహించలేదు.

– నాగలక్ష్మి, ఏడీ, మార్కెటింగ్ శాఖ

ఆకట్టుకున్న తుపాకులు..

అబ్బురపర్చిన విన్యాసాలు

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: పోలీసు అమర వీరుల వారోత్సవాల్లో భాగంగా కొత్త బెలగాంలో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. పోలీసుల విధులు, ఎదురయ్యే సవాళ్లు, సాంకేతిక పరిజ్ఞానం, తుపాకుల్లో రకాలు, వినియోగం, గ్రేనైడ్ల పనితనం గురించి ఎస్పీ మాధవరెడ్డి వివరించారు. మూక దాడులు, అల్లర్ల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పొగ బాంబు వినియోగంపై ఏఎస్పీలు దిలీప్‌కిరణ్, అంకిత సురానా తెలియజేశారు. విద్యార్థులు తుపాకులు ఎక్కుపెట్టి ఫొటోలకు ఫోజులిచ్చారు.



తుపాకీ గురిపెట్టిన విద్యార్థిని

ఆసక్తిగా తిలకించారు.. ఓ బాలిక రుమాలు (చేతివస్త్రం)తో ముఖం, చేతులు తుడుచుకొని మరో పది రుమాళ్ల మధ్య పెట్టింది. అంతకు ముందు ఓ శునకం బాలిక వద్దకు వచ్చి వాసన చూసింది. గుంపు మధ్యలో ఉన్న విద్యార్థిని తుడుచుకున్న రుమాలు గుర్తించి పోలీసు అధికారికి అందించింది. ఈ ప్రక్రియను విద్యార్థులు ఆసక్తిగా గమనించారు. అనంతరం హడల్స్, అగ్నితో ఉన్న రింగుల్లోంచి జంపింగ్స్, డ్రగ్స్ వాసన పసిగట్టడం తదితర విన్యాసాలతో శునకాలు అబ్బురపరిచాయి.



ఆకట్టుకున్న డాగ్ షో

ప్రయాణించాలంటే ప్రయాసే..!

కంచిలి మండల పరిధి అంపురం కూడలి నుంచి ఘాటి ముకుందపురం రహదారిలో భారీ గుంతలు ఏర్పడ్డాయి. నారాయణబట్టి వరకు ఇదే పరిస్థితి నెలకొంది. దీంతో వాహనదారులు ఆ మార్గంలో ప్రయాణించాలంటే బాధలు పడుతున్నారు. ఈ విషయం ఆ శాఖ ఏఈ విక్రమ్ వద్ద ప్రస్తావించగా టెండర్ల ప్రక్రియ పూర్తయిందని నవంబర్ మొదటి వారంలో పనులు ప్రారంభిస్తామన్నారు.

– న్యూస్‌టుడే, కంచిలి గ్రామీణం



కప్పేశాయ్..!



మందస మండల పరిధిలో జాతీయ రహదారి నుంచి కొండలోగాం మీదుగా ఎంఎం రోడ్డుకు వెళ్లే రహదారి ఇది. రెండు వైపులా బెర్మ్‌ల్లో పొదలు అల్లుకుని ఇరుకుగా మారింది. ఇటీవల ఎమ్మెల్యే గౌతు శిరీష పిలుపు మేరకు కొండలోగాం నుంచి టంగరపుట్టి వరకు పొదలు తొలగించారు. మిగతా భాగాన్ని వదిలేశారు. దీంతో తీవ్ర అసౌకర్యం నెలకొందని వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పొదలు తొలగిస్తామని కుసుమాల సర్పంచి ఎస్.సుధాకర్ తెలిపారు.

–న్యూస్‌టుడే, మందస

ఉత్సాహంగా క్రీడా పోటీలు


పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యార్థులు ఆటల్లో రాణించి ఉమ్మడి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని డీఈవో పగడాలమ్మ సూచించారు. మండలంలోని ఎమ్మార్‌నగరం జడ్పీ పాఠశాల ఆధ్వర్యంలో వెంకంపేటలో ఉభయ జిల్లాల అథ్లెటిక్స్ పోటీలు ప్రారంభించారు. 55 పాఠశాలల నుంచి 223 మంది క్రీడాకారులు తరలివచ్చి వివిధ రకాల క్రీడల్లో పాల్గొన్నారు. ఇక్కడ 10 రకాల క్రీడలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి మురళి తెలిపారు.



పోటీలు ప్రారంభిస్తున్న డీఈవో పగడాలమ్మ

శ్రీక్షేత్రంలో నేడు, రేపు దర్శనాలు రద్దు

గోపాలపూర్, న్యూస్‌టుడే: పూరీ శ్రీక్షేత్రంలో గురు, శుక్రవారాల్లో భక్తుల దర్శనాలు రద్దు చేశారు. పూరీ పాలనాధికారి సిద్ధార్థశంకర్ స్వయిన్ బుధవారం సాయంత్రం విలేకర్లతో మాట్లాడుతూ తుపాను వల్ల పూరీలో 60 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని, వానలు కురుస్తాయని ఐఎండీ హెచ్చరించిన నేపథ్యంలో భద్రత దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. హబిషార్థులు కూడా ఆలయానికి రావద్దన్నారు. వారు తమ శిబిరాల్లోనే ఉండి స్వామికి ఆరాధించాలన్నారు. శ్రీక్షేత్రం వెలుపల నుంచి కూడా పతితపావన దర్శనం చేసుకోరాదని, ఆలయం పరిసరాలకు రావద్దని భక్తులకు విన్నవించారు.



నందన్‌కానన్ మూసివేత

భువనేశ్వర్‌లోని జంతు ప్రదర్శనశాల నందన్‌కానన్ గురు, శుక్రవారాల్లో మూసివేస్తున్నట్లు అధికారవర్గాలు బుధవారం ఒక ప్రకటనలో తెలిపాయి. తుపానును దృష్టిలో ఉంచుకొని వన్యప్రాణులు, సందర్శకుల భద్రత కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నాయి.

పర్యాటక కేంద్రాల మూత

గోపాలపూర్, న్యూస్‌టుడే: తుపాను తీవ్రతను దృష్టిలో పెట్టుకొని ముందు జాగ్రత్తగా ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని ప్రముఖ పర్యాటక కేంద్రాలు మూసివేతకు ఆదేశించింది. దీంతో సందర్శకులంతా తిరుగుముఖం పట్టారు. పూరీ, గోపాల్‌పూర్, సతకోశియా, చిలికా, కోణార్క్ పరిధుల్లోని పంథనివాస్‌లు, హోటళ్లు ఖాళీ అయ్యాయి. పూరీలో కార్తిక వ్రతాలు చేయడానికి వచ్చిన హబిషార్థులు మినహాయిస్తే భక్తుల సందడి లేదు. గోపాల్‌పూర్, పూరీ తీరాలు వెలవెలబోతున్నాయి. ఆయాచోట్ల నియమితులైన అగ్నిమాపక సిబ్బంది, లైఫ్‌గార్డులు ఎవరినీ తీరం సమీపంలోకి అనుమతించడం లేదు. మత్స్యకారులు వేటకు వెళ్లలేదు. వలలు, వాటిని లాగే తాళ్లు బాగు చేసుకుంటూ గడిపారు.

అనుమతులు రద్దు చేయకపోతే ఆందోళన

పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: బడిదేవర కొండపై గ్రానైట్ తవ్వకాలకు అనుమతులు రద్దు చేయాలని సీపీఎం, రైతు కూలీ, రైతు, గిరిజన సంక్షేమ సంఘాల ప్రతినిధులు డిమాండు చేశారు. బుధవారం వారంతా తవ్వకాలు పరిశీలించారు. పిండిలోవ నుంచి సంగంవలస వరకు ఆనుకొని ఉన్న కొండ హద్దులు మార్చి అనుమతులు ఇవ్వడం శోచనీయమన్నారు. వెలగవలస ప్రజలతో మాట్లాడి అభిప్రాయాలు సేకరించారు. అనుమతులు రద్దు చేయకపోతే ఆందోళన ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. ఆయా సంఘాల నాయకులు రంజిత్, కృష్ణమూర్తి, రాము, రామస్వామి తదితరులు ఉన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న ప్రతినిధులు

నాటుసారా, ఊట ధ్వంసం

జియ్యమ్మవలస, న్యూస్‌టుడే: మండలంలోని చినమేరంగి సమీపంలో నిర్వహిస్తున్న నాటు సారా స్థావరంపై చినమేరంగి ఎస్ఐ పి.అనీష్, సిబ్బంది దాడులు చేశారు. 400 లీటర్ల ఊట ధ్వంసం చేసి, 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. పలువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా సౌర విద్యుత్తు

ఈనాడు, విశాఖపట్నం: సౌర విద్యుత్తు వినియోగానికి ముందుకు వచ్చేవారికి పీఎం సూర్యఘర్ పథకంలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీలిస్తున్నాయి. మూడు కిలోవాట్లకు రూ.78 వేల వరకు ఆర్థిక సాయం చేస్తున్నాయి. ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు ఉచితంగానే అందుబాటులోకి తేవాలని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. ఈ మేరకు డిస్కంల వారీగా వివరాలు సేకరించాలని ఆదేశాలు జారీ చేసింది.



◆ 'ఇళ్లలో వినియోగించే విద్యుత్తు కంటే సోలార్ ద్వారా ఎక్కువ ఉత్పత్తి జరిగితే ఆ మిగులును డిస్కంకు తిరిగి అమ్మి సొమ్ము చేసుకోవచ్చు. ఒకసారి పలకలు ఏర్పాటు చేసుకుంటే 25 ఏళ్ల పాటు నిరంతరాయంగా వినియోగించవచ్చు. ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారుల గుర్తింపు సర్వే పూర్తయింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు కార్యాచరణ ఉంటుంది' అని ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ తెలిపారు.

ఇద్దరికీ లాభమే..

వందశాతం రాయితీతో పరికరాలు

◆ ఈ కనెక్షన్ల వల్ల లబ్ధిదారులతో పాటు ప్రభుత్వానికీ ప్రయోజనమే. సౌర పలకలపై పెట్టుబడితో యంత్రాంగంపై మొదట కొంత ఆర్థిక భారం పడినా దీర్ఘకాలంలో విద్యుత్తు కొనుగోలు, పంపిణీ ఖర్చు భారీగా తగ్గనుంది.

◆ ఇప్పటికే ఎస్సీ, ఎస్టీల్లో 200 యూనిట్ల లోపు వినియోగించేవారికి ఉచితంగా విద్యుత్తు సరఫరా చేస్తున్నారు. ఒక్కో యూనిట్‌పై సుమారు రూ.6 వరకు వెచ్చిస్తోంది. అదే సోలార్ ద్వారా అందించగలిగితే ఆ సొమ్ము ఆదా అయినట్లే. ఈ లబ్ధిదారులు చాలా మంది 100 నుంచి 150 యూనిట్ల మధ్యనే వినియోగిస్తుంటారు. ఒక కిలోవాట్ సోలార్ ఉపకరణాలతో నెలకు 120 యూనిట్లు సౌరశక్తి ద్వారా అందుబాటులోకి వస్తుంది. మిగతా 20 నుంచి 30 యూనిట్ల భారమే ప్రభుత్వంపై పడుతుంది.

కనెక్షన్ల సంఖ్య ఇలా..

ఉమ్మడి సర్కిల్	ఎస్సీ	ఎస్టీ
శ్రీకాకుళం	44,667	29,767